దర్గాగా వంక పోరంబోకు భూమి ఆక్రమణ

దారికి అడ్డుగా కంచె ఏర్పాటు - ఆగని భూ కబ్జాల పర్వం- జిల్లా సర్వోన్నతాధికారి స్పందిస్తారని ఆశిద్దాం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలం సున్నపురాళ్లపల్లె గ్రామపంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి దర్గాగా ప్రభుత్వ వంక భూమిని ఆక్రమించుకొని చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో అటు పైన ఉన్న కొండ ప్రాంతానికి పశువులను మేతకు తరలించేందుకు వీలు లేకుండా పోయింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సున్నపురాళ్లపల్లె గ్రామ పంచాయతీ సర్వే నెంబర్లు 616/2, 619/4, 619/5, 619/6తో పాటు మరికొన్ని సర్వే నెంబర్లకు సంబందించిన సుమారు 50 నుండి 60 ఎకరాలకు పైబడి భూమిని రైతుల నుండి ఓ వ్యక్తి కొనుగోలు చేయడం జరిగింది. ఈ భూముల సమీపంలో కలమల్ల వంక ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 283లో 428.66 ఎకరాలు ఉంది. సదరు వ్యక్తి వంక భూమిని కూడా సుమారు 10 ఎకరాల వరకు ఆక్రమించుకొని కొనుగోలు చేసిన భూమితో పాటు ఆక్రమిత భూమికి కూడా కంచెతో ఫినిషింగ్ చేయడం జరిగింది. ఇక్కడి 622 సర్వే నెంబరు నుండి 625 సర్వే నెంబర్ల పొలాల గుండా కాలిబాట ఉండేది. ఈ బాట ఎద్దలబండ్లు సైతం నడిచేందుకు వీలుగా సుమారు 10 అడుగుల వెడల్పుతో రస్తా ఉండేది. రైతాంగంతో పాటు పశుపోషకులు కూడా ఈ దారి గుండా తమ పశువులను సమీపంలోని కొండకు మేత కొరకు తీసుకెళ్లేవారు. సున్నపురాళ్లపల్లె, ఇండ్లసిద్దాయపల్లె గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలు అధికంగా నివసిస్తున్నారు. వీరు పశుపోషణ ద్వారా జీవనం కొనసాగిస్తున్నారు. వీరు ఎనుములు, ఆవులు, గొర్రెలు, మేకలను పెంచుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం వీరికి కొండపైకి వెళ్లేందుకు రస్తా సౌకర్యం లేకుండా కంచె అడ్డుగా ఏర్పాటు కావడంతో వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత భూమిని కొన్న సదరు వ్యక్తి మరికొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఇలా కంచె ఏర్పాటు చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడే రైల్వే అండర్‌బ్రిడ్జి కూడా ఏర్పాటై ఉంది. రైల్వే అధికారులు కొండ వైపు వెళ్లే వారి సౌకర్యార్థం ఇక్కడ అండర్‌బ్రిడ్జిని ఏర్పాటు చేయడం గమనార్హం. అండర్‌బ్రిడ్జి గుండా కాలిబాట రస్తాలో పశువులు కొండకు రాకపోకలు కొనసాగించేవి. ఇలాంటి నేపథ్యంలో సదరు వ్యక్తి కంచెఏర్పాటు చేయడం వెనుక అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సదరు నేతల సిఫారసుల కారణంగానే రెవెన్యూ యంత్రాంగం సైతం ఈ వ్యవహారంలో చోద్యం చూస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నేతల సిఫారసుల వెనుక పనిచేసిన బలమైన అంశాలేవో బోధపడని అంశంగా ఇక్కడి గ్రామీణ ప్రజలు

చెప్పుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వనరుల పరిరక్షణలో భాగంగా కొండ, గుట్ట, నదులు, చెరువులు, వాగులు, వంక స్థలాల అంశంలో అనేక కఠిన చట్టాలు తీసుకువచ్చాయి. వీటిని ఎలాంటి పరిస్థితుల్లోను ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపైనే ఉంది. అయితే దురదృష్టవశాత్తు ఇటీవలి కాలంలో ఇలాంటి ప్రభుత్వ భూములు కబ్జాకు గురై భూ బకాసురుల కబంధ హస్తాల్లోకి వెళుతున్నప్పటికీ స్పందించే అధికారులు కరువుకావడం ప్రజలు చేసుకున్న ఖర్మ కాబోలు. ఇలాంటి భూదందాల వ్యవహారాలపై కఠినంగానే ఉన్న జిల్లా సర్వోన్నతాధికారి సున్నపురాళ్లపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఆక్రమణలకు గురైన వంక పోరంబోకు భూమికి విముక్తి కల్పించడంతో పాటు రస్తాను పునరుద్దరించేలా తగు చర్యలు తీసుకుంటారని ఈ ప్రాంతవాసులు ఆశిస్తున్నారు. అలాకాకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే భూ బకాసురులు మరింత రెచ్చిపోయి ఇతరత్రా ప్రభుత్వ భూములపై కన్నేసే ప్రమాదం ఉందని వారు గుర్తుచేస్తున్నారు. మరి జిల్లా యంత్రాంగం ఆ దిశగా చర్యలకు ఉపక్రమిస్తుందని ఆశిద్దాం.

జగనన్న కాలనీల సమస్యలపై నేడే చలో కలెక్టరేట్

విశాలాంధ్ర-కడప రూరల్ : జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం కోసం ప్రతి లబ్ధిదారునికి ఐదు లక్షలు రూ చెల్లించి, సిమెంట్, ఐరన్ (స్టీల్), ఇసుకను ఉచితంగా చెల్లించి మౌళిక వసతులు నీరు, కరెంటు, రోడ్లు వేయాలని సిపిఐ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నేడు ఫిబ్రవరి 6న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని సిపిఐ నగర సహాయ కార్యదర్శి కెసిబాదుల్లా, కార్య వర్గ సభ్యులు కే.మునయ్య,ఇన్సాఫ్ నగర కార్యదర్శి ఎస్.మైనుద్దీ న్‌లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కొప్పర్తిలోని జగనన్న కాలనీలో లబ్ధిదారుల తో కరపత్రాలు ఆవిష్కరించారు. నేడు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనకు లబ్ధిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప జిల్లా వ్యాప్తంగా 13 సెంటర్లలో జాతీయ ఉపకార వేతన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షను వైఎస్ఆర్ కడప జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డా.అంబవరం ప్రభాకర్ రెడ్డిలు కడప నగరంలోని మునిసిపల్ ఉర్దూ బాయ్స్ పాఠశాల, మున్సిపల్ హై స్కూల్ మెయిన్‌ను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 2358 మంది విద్యార్థులు గాను 2271 (96 శాతం) మంది విద్యార్థులు హాజరైనారు. ఈ పరీక్షకు 8వ తరగతి పూర్తి కాబోతున్న ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 9, 10, 11, 12 తరగతులు చదువుటకు సంవత్సరానికి 12000 చొప్పున నాలుగు సంవత్సరాలకు 48 వేల రూపాయలు మెరిట్ స్కాలర్షిప్ కింద చదువుకోడానికి అవకాశం వస్తుంది. ఈ పరీక్ష ద్వారా ప్రభుత్వం కల్పించే మెరిట్ స్కాలర్షిప్ ను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఒక లక్ష్య సాధన తోటి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరిండెంట్ నాగమని డిపార్ట్మెంటల్ స్క్వాడ్ విజయ రెడ్డి, పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం

విశాలాంధ్ర - పులివెందుల: పట్టణంలో ఆదివారం శ్రీవారి బ్రహ్మోత్సవం వైభవంగా సాగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం గ్రామ ఉత్సవం ఏర్పాటు చేశారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. స్థానికంగా నే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో పులివెందుల జనసంద్రంగా మారింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా ధ్వజస్థంభ స్థాపన

విశాలాంధ్ర- యర్రగుంట్ల : స్థానిక ముద్దనూరు రోడ్డు లోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి దేవ స్థానం ప్రాంగణంలో ఆదివారం అత్యంత వైభవంగా ధ్వజస్థంభ స్థాపన కార్యక్రమం జరిగింది. ఉదయం 7 గంటల నుండి ప్రత్యేక హెూమం, ఆదివాస హెూమాలతో పాటు గర్త పూజ యంత్ర స్థాపన, ధ్వజస్థంభ స్థాపన జరిగింది. అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి ప్రత్యేక ఏర్పాటు చేయడం గమనార్హం. ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ఆలయ పాలక మండలి సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె: మండలంలోని లక్కిరెడ్డిపల్లె - పందిళ్ళపల్లె మార్గమధ్యంలోని మద్దిరేవుల గ్రామం మార్లవాండ్ల పల్లెకు ఆదివారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో పందిళ్ళపల్లి నుండి లక్కిరెడ్డిపల్లి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం మార్లవాండ్లపల్లెకు సమీపంలోని రోడ్డు పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో పెద్ద శబ్దం రావడంతో నిద్రలో ఉన్న గ్రామస్తులు ఒక్క సారిగా ఉలిక్కి పడ్డారు.ఏమి జరిగిందో వారికి అర్థం కాక లేచి బయటకు వచ్చి చూసేసరికి మంటలు వచ్చి రోడ్డుపైకి విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో సమీపంలో నీ సబ్ స్టేషన్ కి ఫోన్ చేసి సరఫరా ను నిలిపివేశారు అని అన్నారు. విద్యుత్ స్తంభాన్ని డికొన్న కారు లో ప్రయాణిస్తున్న వ్యక్తికి కూడా ఎటువంటి అపాయం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.పల్లెకు యిరు వైపులా 11 కే.వి. విద్యుత్ లైన్ లు ఉండడంతో జరిగిన సంఘటన మార్లవాండ్లపల్లెకు పెను ప్రమాదమే తప్పినట్లు అయ్యింది.ట్రాన్స్ కో అధికారులు నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్దరించక పోవడంతో గ్రామస్తులు తో పాటు వాహనదారులు కూడా భయభ్రాంతులకు గురవుతూ ఉన్నారు.వెంటనే వొరిగిన స్తంభం వద్ద నూతన స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు,వాహనదారులు కోరుతూ ఉన్నారు.

ఘనంగా భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామంలోని జ్యోతి సిద్దవటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీ భ్రమరాంభ సమేత శ్రీమల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం శ్రీశైలం దేవస్థాన ఆలయ ఈఓ లవన్న ఆధ్వర్యంలో వేదంపండితులు సుబ్రహ్మణ్యం శర్మ, పవన్ కుమార్ శర్మ, ముఖ్య అర్చకులు సత్యనారాయణ శర్మ, అర్చకులు మణికంత స్వామి, పార్వతయ్య స్వామి, సిద్దేశ్వర స్వామి, ప్రవీణ్ కుమార్ శర్మలు వేద మంత్రాలతో కన్నుల పండుగలా ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా గణపతి పూజ, కంకణాదారణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యదారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఎస్సై తులసి నాగ ప్రసాద్, జ్యోతి సర్పంచ్ పిన్నపురెడ్డి సుబ్బమ్మ, ప్రతినిధి పిన్నపురెడ్డి రవిశేఖర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి, మాజీ ఉప మండలాధ్యక్షులు దశరథరామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పుత్తా గెలుపునకు కృషి చేద్దాం: టీడీపీ

విశాలాంధ్ర-చెన్నూరు : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పుత్తా నర్సింహారెడ్డిని ఎమ్మెల్యేని చేసుకుం దామని మండలంలోని రామనపల్లె క్లస్టర్ ఇంచార్జ్ తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి (బుజ్జన్న), జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్‌లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రామనపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్తలను సమావేశపరిచి వారికి విందు ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జి తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలకై నిరంతరము పోరాటం చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహా రెడ్డిని కార్యకర్తలు కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేగా గెలిపిచుకుందాం అని తెలిపారు. రామనపల్లి గ్రామం అభివృద్ధి జరిగిందంటే టీడీపీ మరియు పుత్తా నరసింహా రెడ్డి తోనే అని స్పష్టం చేశారు. రానున్నది టీడీపీ ప్రభుత్వం అని, ఈ ప్రభుత్వంలో ఒరిగింది ఏమి లేదు అని, ప్రజలు చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాలని ఎలక్షన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణా రెడ్డి, హరి నాద్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, ముండ్ల నరసింహా రెడ్డి, రమణా రెడ్డి, శివా రెడ్డి, నాగసుబ్బా రెడ్డి, బీసీ సెల్ టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం,విశ్వనాద్ రెడ్డి,మల్లి, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ కాశినాయన మండల నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర- కాశినాయన : ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ బద్వేల్ ఏరియా కార్యదర్శి ఏం అశోక్ సిపిఐ మండల కార్యదర్శి సుబ్బా రెడ్డి మాట్లాడుతూ భారత దేశ స్వతంత్ర సంగ్రామంలో విరోచిత పోరాటం చేసి స్వాతంత్రం మా జన్మ హక్కు అని చాటి దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల కోసం నిర్విరామ పోరాటం చేస్తూ భారతదేశంలో 86 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య అని వారు తెలియజేసారు. అలాగే విద్యార్థి పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కుల్ని ఈరోజు దేశంలో ప్రజాస్వామ్యం మాటన నియంతృత్వ పోకడలతో విద్యార్థి యువజన, సామాజిక, సాంస్కృతిక చారిత్రాత్మక ,మానవ మనుగడ తో కూడిన జీవన ప్రయాణానికి ఆటంకం కలిగే విధంగా పాలకుల పాలసీలు తయారవుతున్నాయని విద్యారంగాన్ని సమూల మార్పులు తీసుకొని వస్తున్నారు,ఆంక్షలు విధించే విధంగా ప్రభుత్వాల పనితీరు ఉందని ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేకుండా ప్రజాస్వామ్య గొంతుకలను కూకటివేలతో నులిమి వేస్తున్నారు, విశ్వవిద్యాలయాల్లో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులను జైల్లో వేస్తున్నారు, సామాజిక న్యాయం జరగకుండా విద్యా కాషాయకరణ, విద్యా కార్పొరేట్ సంస్థల కు అమ్మివేస్తూ ఆర్భాటాలు ప్రకటిస్తూ దేశ జీడీపీ శాతంలో ఎంత ఖర్చు పెడుతున్నారు. అదేవిధంగా కొఠారి కమిషన్ నివేదిక ఏం చెబుతుంది అనే అంశాలు పాలకులే అంచనా వేసుకోవాలి అన్నారు, యూనివర్సిటీల కేంద్రంగా డిగ్రీ కళాశాలలో ,ఇంటర్ కళాశాలలో ప్రాథమిక పాఠశాలలో, ఫార్మసీ కళాశాలలో, మెడిసిన్ రంగంలో ఇంజనీరింగ్ కేంద్రంలో ఎక్కడ చూసినా సమస్యలు తాండవిస్తున్న పాలక ప్రభుత్వాలకు అవి కనబడక అధికార దాహం కోసం విద్యారంగాన్ని అటకెక్కించారు, ఉన్నత విలువలతో కూడిన రాజకీయ వ్యవస్థను రాక్షస క్రీడగా మార్చి అగాంతకులను అందలమెక్కిస్తూ విద్యావ్యవస్థను అంగడి సరుకు లాగా డబ్బు ఉన్న వారికే విద్య లాగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు,దేశంలో రాష్ట్రంలో నియంత పూరిత వాళ్లకు ప్రభుత్వాలకు విద్యారంగ సమస్యలు ఎత్తి చూపుటకు కడప జిల్లా 18వ జిల్లా మహాసభాలు అందుకు వేదికై పెద్ద ఎత్తున తిరుగుబాటు జెండా ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలియజేశారు. ఈ జిల్లా మహాసభలకు విద్యార్థి లోకం పెద్దెత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నుకున్న ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ భిన్నత్వంలో ఏకత్వంగా ఐక్యతను చాటుతూ అందరికీ విద్యా, వైద్యం ఉపాధి హక్కుల కోసం నిర్విరామం పోరాటం కొనసాగించాలని తెలియజేశారు.

సాహితీ సంస్కరణలకు గడప మన కడప

పోతనా సాహితీపీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : సాహితీ సంస్కరణలకు గడప మన కడప అని ఒంటిమిట్ట కోదండ రామాలయం అందుకు ఎత్తయిన బావుటా అని పోతనా సాహితీపీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్ అన్నారు. శనివారం ఒంటిమిట్ట కోదండరామాలయంలో హైదరాబాద్‌కు చెందిన సాధన సాహితీ స్రవంతి వారి శ్రీమతి గొడవర్తి సంధ్య రచించిన పోతన చరిత్ర శ్రీ పుస్తకాన్ని పోతనా సాహితీ పీఠం కార్యదర్శి ముమ్మడి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. అలాగే రిటైర్డు ప్రిన్సిపల్ పదకవి మామిళ్ల లోకనాధం రచించిన శ్రీకోదండరామస్వామి శతకాన్ని మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు ఆవిష్క రించారు. అనంతరం మాట్లాడుతూ కవయిత్రి మొల్ల రామాయణం రచించి దానిలోని శ్రమను పండించామన్నారు. సంధ్య పోతన చరిత్ర రాయడం శ్రీ రచయితలకు మార్గదర్శకమని ఆయన అన్నారు. పుట్టపర్తి సాహితీపీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ కడప జిల్లాలో కవులకు రచయితలను ప్రశంసించారు. పోతన సాహితీపీఠం కార్యదర్శి నారాయణరెడ్డి మాట్లాడుతూ యువ కవులు ముందుకు వచ్చి మరెన్నో రచనలు చేయాలన్నారు. రామాలయం అర్చకులు ఈ క్షేత్ర ప్రాశస్త్యాన్ని, రామనామాన్ని మహిమలను వివరించారు. అనంతరం పోతన చరిత్రను ఒంటిమిట్ట రామాలయంలో ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఇది తన పూర్వజన్మ సుకృతమని రచించిన గొడవర్తి సంధ్య అన్నారు. పోతన భాగవతం వేడుకలు తన సంధ్య సంస్కరణలతో హైదరాబాద్‌లో కూడా చేయించేందుకు కృషి చేస్తానని సాధన నరసింహాచార్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ సతీష్, భక్తులు పాల్గొన్నారు. పోతన విగ్రహాన్ని ఒంటిమిట్ట రామాలయ పరిసర ప్రాంతాల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఒంటిమిట్ట మండలంలోని కవులు, సాహిత్యపరులు, ఒంటిమిట్ట మండల ప్రజలు రామాలయం ప్రాంతం దగ్గర ఏర్పాటుచేస్తే మేము పోతన గురించి చెప్పుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తెలిపేందుకు ఉంటుందని ఇది టీటీడీ అధికారులు గమనించి రామాలయ పరిసర ప్రాంతాల్లో పోతన విగ్రహాన్ని, సీతారాముల విగ్రహ ప్రతిష్ట చేసిన జాంబవంతుని విగ్రహాన్ని కూడా ఈ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని మేధావులు, కవులు కోరుకున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి-సీపీఐ

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: నేడు కడప కలెక్టర్ కార్యాలయం వద్ద భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం మీనాపురం వద్ద ఉన్న జగనన్నా కాలనీని షరీఫ్ సందర్శించి లబ్దిదారుల సమస్యలపై ఆరా తీసి లబ్దిదారుల పక్షాన సీపీఐ పోరుబాటకు సిద్ధమైందని తెలిపారు. ఈ సంధభ్బంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కళ నెరవేరుస్తున్నామని చెప్పి ప్రభుత్వం పేదలను ఇబ్బందులకు గురి చేస్తుందని, సెంటు భూమిలో రూ.1.80లక్షలు అందించి ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని చెప్పడం దారుణం అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో అందరికి ఇళ్లు నిర్మిస్తామని చెప్పడం జరిగిందని, అయితే జగనన్నా కాలనీలో నిర్మాణానికి అవసరమైన మౌళిక సదుపాయాలు ఏ మాత్రం కల్పించలేదన్నారు. సిమెంట్, స్టీలు, ఇటుకలు, ఇసుక, కంకర, కిటికీలు, తలుపులు తదితర నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కేటాయించిన వ్యయం రూ.1.80లక్షలు సరిపోవడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జగనన్నా కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేసి లబ్దిదారులకు ప్రభుత్వం రూ.5లక్షలు అందించాలని డిమాండ్ చేస్తూ నేడు కడప కలెక్టర్ కార్యాలయం వద్ద జరగబోవు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లబ్దిదారులకు బాసటగా, వారి సమస్యలపై పోరాటానికి సీపీఐ సిద్ధం అయిందని, నేడు సమస్యల పరిష్కారానికి బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గసభ్యులు ఏసూఫ్; ప్రతాప్, సోమశేఖర్ రెడ్డి, బాష, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజకోనలో ప్లాస్టిక్ నిషేధం

వాతావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి: కడప డిఎఫ్ఓ పి. వెంకట సందీప్ రెడ్డి

విశాలాంధ్ర-సిద్దవటం : మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిత్యపూజకొనలో అన్నదాన కార్యక్రమాలకు ప్లాస్టిక్ ప్లేట్లు, వాటర్ ప్యాకెట్లు వంటివి ప్లాస్టిక్ వస్తువులను నిషేదించాలని కడప డిఎఫ్ఓ పి. వెంకట సందీప్ రెడ్డి అటవీశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని వంతాటిపల్లి గ్రామపంచాయితీ పరిధిలోని లంకమల అభయా రణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజయ్య స్వామి ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఛైర్మెన్ కొండారెడ్డి పూలమాల వేసి శాలు వాతో సన్మానించారు. అనంతరం ఆయన లంకమల అభయారణ్యంలో అటవీశాఖ చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను ఆర్టీసీ బస్సులను నిలుపు స్థలాన్ని పరిశీలించారు. మహాశివరాత్రిని సందర్భంగా స్వచ్ఛందంగా వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం పెట్టేవారు ప్లాస్టిక్ పేపర్లు, విస్తర్లు ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని వన్యప్రాణాలు దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ ను అటవీ ప్రాంతంలో ఎక్కడబడితే అక్కడ వేయకుండా వాతావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. మధ్యపానం, దూమపానం, ప్లాస్టిక్ నిషేధం, అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసేందుకు అనుమానం ఉన్నట్లయితే చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం రేంజర్ ప్రసాద్, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, బీటు అధికారి రాజశేఖర్ రెడ్డి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా నిర్మాణానికి నగదు అందచేసిన ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: షా హుస్సేన్ దర్గా నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి నగదును అందచేశారు. ఆదివారం షా హుస్సేన్ దర్గా మసీదు వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో నగదును అంజుమన్ కమిటీ సభ్యులకు అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ షా హుస్సేన్ దర్గా పున: నిర్మాణానికి ఆనాడు తాను రూ.1కోటి ప్రకటించానని, మొదటగా రూ.30 లక్షల నగదును ప్రకటించిన రోజునే అందించానని రెండవ విడతగా ఈనాడు రూ.20లక్షల నగదును అందిస్తున్నానని తెలిపారు. ముస్లింలు అందరు నా సోదరులతో సమానం అన్నారు. పట్టణంలో దర్గా మరియు ఈద్గా నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ముస్లిం సోదరులకు ఎలాంటి సమస్యలున్నా తాను ఉన్నానని మరిచిపోవద్దు అన్నారు. ముస్లింలు ప్రార్ధనా గ్రంధం భోదిస్తున్నారని ఏమిటంటే ఖురాన్ చదివిన ప్రతి ముస్లిం సోదరునికి ఈ అంశాలు తెలిసి ఉంటాయన్నారు. విశ్వాసం, ఉపవాసం, నమాజ్, జకాత్, హజ్‌యాత్ర అని పేర్కొన్నారు. ఖురాన్‌ను అనుకరిస్తే దాన దర్మాలవైపు మనస్సు మరలుతుందన్నారు. ముస్లింల పట్ల అమితమైన ప్రేమ ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మొదట జగన్‌మోహన్ రెడ్డి కనబరుస్తున్నారన్నారు. నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అందలాన్ని చేకూర్చడంలో ముస్లింల పాత్ర ఎంతో ఉందన్నారు. అందుకే ఈ రాచమల్లు ఎప్పటికి ముస్లింలకు దాసోహమై ఉంటాడన్నారు. ముస్లిం కమ్యూనిటి సేవా కార్యక్రమాలు తాను ఎప్పటికి ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటి ప్రెసిడెంట్ బొల్లవరం బాషా మాట్లాడుతూ షా హుస్సేన్ దర్గా అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో సహకారం అందిస్తున్నారని, దర్గా నిర్మాణానికి దాదాపు రూ.1కోటి అందిస్తానన్న ఎమ్మెల్యే దాతృత్వం ఎంతో గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు, ఆప్కాబ్ చైర్మెన్ మల్లెల ఝాన్సీ రాజారాంరెడ్డి, కౌన్సిలర్లు ఇర్ఫాన్, కమాల్‌బాష, వడ్ల ఖలీలుల్లా, 12వ వార్డు ఇంచార్జ్ షేక్‌దర్గా మహమ్మద్ హనీఫ్, ఇదాయత్, వడ్ల దాదాపీర్, జాఫర్‌హుస్సేన్, పాలగిరి ఖాజా, అంజుమన్ కమిటీ సెక్రటరీ ఖురేషి ఇలీయాస్, కామిశెట్టి బాబులతో పాటు ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : స్థానిక 42/3 వ డివిజన్ నబీకోట లోని పలు వీధుల లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉపముఖ్యమంత్రి,రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖామంత్రి అంజాద్ బాషా నిర్వహించి, నబీకోట కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని ఉపముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వార్డులోని అన్ని ఇళ్లకు తిరుగుతూ కుటుంబాలను కలుసుకోవడంతో పాటు, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా స్వప్న, ఇంచార్జి చల్లా రాజశేఖర్, తహసీల్దార్ శివరామిరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ బంగారు నాగయ్య, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, బండి ప్రసాద్, నాగేంద్ర, రెడ్డి ప్రసాద్, వైకాపా నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, తుమ్మలకుంట శివ శంకర్, షఫీఉల్లాహ్, అహమ్మద్, నాయకురాళ్లు టి.వి. సుబ్బమ్మ, మరియలు, నారాయణమ్మ, ఛైర్మన్‌లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పీలేరు: స్థానిక మండలంలోని పల్లవోలు గ్రామ పంచాయతీ కస్పా నందు వైయస్సార్ పార్టీ నాయకుడు లక్ష్మీనారాయణ నూతన గృహప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ వ్రతము పూజల పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్లవోలు గ్రామపంచాయతీ సర్పంచ్ బి బి ఆయేషా, ఇస్తియా అహ్మద్, జునేద్ అహ్మద్, షమీవుల్లా, పోస్ట్ రాజా, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మున్సిపల్ వైస్‌చైర్మెన్ బంగారురెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మా నాన్న మదర్‌థెరిస్సా షబ్బీర్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మెన్ బంగారురెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్ల అన్నదానం గొప్పదని అన్నారు. ప్రతి ఒక్కరు దాణగుణం కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు వై.హిదాయత్, వైస్‌ప్రెసిడెంట్ షేక్ ఫకృద్దీన్, కౌన్సిలర్ వడ్ల ఇబ్రహీం ఖలీలుల్లా పాల్గొన్నారు.

రథోత్సవ వేడుకలలో వైయస్ మనోహర్ రెడ్డి

విశాలాంధ్ర పులివెందుల: పట్టణంలో ఆదివారం నిర్వహించిన శ్రీవారి రథోత్సవ వేడుకలలో వైసీపీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ లు హాజరయ్యారు. కార్యక్రమంలో , రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి గారు మరియు కౌన్సిలర్ లు కోడి రమణ , పార్నపల్లి కిషోర్, లక్ష్మి భార్గవి, కో ఆప్షన్ చంద్రమౌళి, వైఎస్సార్సీపీ నాయకులు రాజేష్ నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు మిట్టా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

8న రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-కడప రూరల్ : కర్ణాటకలో తుంగభద్ర డ్యామ్ పై భాగంలో "ఎగువ భద్ర" ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 5300 కోట్ల నిధులను కేటాయించడానికి వ్యతిరేకిస్తూ... కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వల్ల రాయలసీమ రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని... ఈ అంశంపై ఈనెల 8వ తేదీన కడప ప్రెస్ క్లబ్ లో అన్ని రాజకీయ పక్షాలు రైతు సంఘాలతో కలిపి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి కొమ్మది ఈశ్వరయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు.ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మించడం వల్ల తుంగభద్ర డ్యామ్‌కు దిగువ బాగాన ఉన్న హెచ్.ఎల్.సి, ఎల్ ఎల్ సి, పోతిరెడ్డిపాడు, రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ మొదలగు ప్రాజెక్టుల కింద ఉన్న దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టు కలిగిన రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. ఈ సమావేశానికి అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల రైతు సంఘం నేతలు పాల్గొనాలని కోరారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర పులివెందుల : పులివెందుల పట్టణంలో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి వైసిపి అభ్యర్థిగా గోపాల్ రెడ్డి ని ముఖ్యమంత్రి జగన్ ఎంపిక చేయగా ఆయన అభ్యర్థిత్వాన్ని కడప ఎంపి వైయస్ అవినాష్ రెడ్డి బలపరిచారు. ఈ క్రమంలో రవీంద్రారెడ్డి తరఫున వైసిపి నాయకులు ఆదివారం రాజ్యలక్ష్మి థియేటర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి కౌన్సిలర్లు లక్ష్మి భార్గవి, కోడి రమణ సచివాలయం కన్వీనర్లు శ్రీ రాములు, ప్రదీప్, వీణ,వైఎస్సార్సీపీ నాయకులు రమేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకల్లో టిడిపి నాయకులు

విశాలాంధ్ర - వేంపల్లి: వేంపల్లి లో టిడిపి నాయకుడు గంగాధర్ రెడ్డి సోదరి ఉచిత వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు టిడిపి పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ ఎమ్మెల్సీ బీటెక్ రవి హాజరయ్యారు. కార్యక్రమంలో మండల కన్వీనర్. సింగారెడ్డి. మునిరెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షులు షేక్. వల్లి. వేంపల్లి మండల ప్రధాన కార్యదర్శి. మహమ్మద్. మరియు. రామాంజి. షేక్. నజీర్. మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన హోమాలు

విశాలాంధ్ర - పులివెందుల: సింహాద్రి పురం పంచా యతీ పరిధి లోని బుడ్డయ్య పాలెం లో నిర్వహించిన హెూమాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. బుడ్డయ్య స్వామి ఆల య కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు లోక కళ్యాణం కోసమే ఇటువంటి కార్యక్రమాలు చేపడతామని ధర్మవరం జమ్మలమడుగుకు చెందిన కృష్ణయ్య చౌడయ్య ముని రెడ్డిలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న పుట్టా

విశాలాంధ్ర - మైదుకూరు : చాపాడు మండలం విశ్వనాథ పురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ దేవాలయం విగ్రహ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో కమిటీ వారి ఆహ్వానం మేరకు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న టిటిడి మాజీ చైర్మన్ మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన పుట్టా సుధాకర్ యాదవ్ కి పూర్ణ కుంభం తో వేద పండితులు స్వాగతం,పలుకగా,అభిమానులు ,నాయకులు ఘన స్వాగతం పలికారు..గుడిలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి హరితితో పాటు తీర్థ ప్రసాదాలు అందచేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల, నాయకులు,కార్యకర్తలు ,అభిమానులు భారీగా పాల్గొన్నారు.

కళ్యాణ మహెూత్సవాల్లో సహకార బ్యాంక్ చైర్మన్

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని సోమిరెడ్డి పల్లె సహకార పరపతి సంఘం చైర్మన్ నేలటూరి సుబ్బారెడ్డి ఆయన సతీ మణితో కలిసి బద్వేల్ పట్టణం లోనే పోరుమామిళ్ల వెలిసి ఉన్న తోశివ పార్వతుల సీతారాముల కళ్యాణోత్సవం ప్రత్యేకం గా పాల్గొని ప్రత్యేక పూజలు ప్రత్యేకంగా అభిషేకాలు ప్రత్యేక హెూమంలో కార్యక్రమాలలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో వేద పండితులు సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షలకు పెంచాలి- టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి
నేడు కలెక్టరేట్ వద్ద జరుగు ఆందోళన జయప్రదం చేయండి: సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో అందరికీ ఇల్లు నిర్మాణం పేరుతో చేపట్టిన జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఇంటి నిర్మాణ వ్యయాన్ని పెరిగిన ధరలకు అనుగుణంగా 1 లక్ష 80 వేల నుండి 5 లక్షలకు పెంచాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఐ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళన జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా అందరికీ ఇల్లు అన్న నినాదంతో 2019 జూలై 1న రాష్ట్రంలో 9024 జగనన్న కాలనీలు, నాలుగేళ్లలో 27 లక్షల ఇల్లు నిర్మాణం లక్ష్యంగా చేసుకున్నప్పటికీ మొదటి విడత 2019 ఆగస్టు 26 నాటికి 15 లక్షల 03 వేల 810 ఇల్లు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. కడప జిల్లాలో అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ 33 వేల 016 ఇల్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో 62 వేల 633 ఇల్లు మొత్తం కలిపి 95 వేల 649 ఇల్లు మంజూరు చేసినప్పటికీ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ధరల పెరుగుదల ప్రభావం లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదన్నారు. జిల్లాలో 335 జగనన్న కాలనీల్లో 77వేల 290 మందికి పట్టాలు పంపిణీ చేశారని ఇందులో ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 7వేల418 మంది స్వంతంగా కట్టుకుంటామని, 29వేల 252 మంది సామాగ్రి ప్రభుత్వం ఇవ్వాలని, 45వేల 347 మంది ప్రభుత్వమే కట్టించాని లబ్ధిదారుల్లో సగానికి పైగా ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలన్న డిమాండ్ ను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 1లక్షా 50 వెలు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 30 వేలు మాత్రమే ఇస్తే ప్రస్తుత ధరల ప్రకారం గునాది నిర్మాణం కూడా పూర్తి కాదన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తక్షణం ఇంటి నిర్మాణం చేపట్టకపోతే రద్దు చేస్తాం అంటూ వాలంటీర్లు బెదిరిస్తున్నారని కానీ కాలనీల్లో మౌలిక అడుపాయాలయిన రోడ్లు, కరెంట్, నీళ్ళు లేకుండా ఏ విధంగా కట్టుకుంటారు అన్నారు. అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు ఇల్లు కట్టిస్తామంటు లబ్దిదారులతో డబ్బులు వసూలు చేసి ఉడాయించారాన్నరు. కొందరు రద్దు చేస్తారన్న భయంతో నిర్మాణం కోసం అధిక వడ్డీలకు తెచ్చి అప్పుల పాలయ్యారన్నారు. టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేయడం వల్ల కంపచెట్లతో సిదియావస్తకు చేరుకుంటున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీ ఇంటి నిర్మాణ వ్యయాన్ని 1.80 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఐకమత్యంతోనే విజయాలు సాధిస్తాం

విశాలాంధ్ర - చెన్నూరు : తామంతా ఐకమత్యంతో ఉంటూ వచ్చే ఎన్నికల్లో ఘన విజయాలు సాధిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేతలు కమలాపురం నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షులు అన్వర్ హుస్సేన్ మైనార్టీ నాయకులు అబ్దుల్ రబ్బు సీనియర్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి తామంతా ఒకటిగానే ఉంటూ పార్టీ కోసం పని చేస్తున్నామన్నారు. అయితే కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి సూచనల మేరకు మరింత ఐక మత్యంగా ఉంటే బాగుంటుందన్న ఉద్దేశంతో చిన్నపాటి విందు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటున్నామని ఇందులో భాగంగానే ఆదివారం మైనార్టీ నాయకులం అందరం కలిసి మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు అల్పాహార విందు ఏర్పాటు చేశామన్నారు. ఇదే ఐకమత్యంతో పని చేస్తూ మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఐకమత్యంతో కలిసి పని చేస్తామని పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కరీం నాయకులు మునీర్ ఎంపీటీసీ సాధకువల్లి జుమాం యాసిన్ నూర్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి జయిస్తే విజయం తథ్యం

విశాలాంధ్ర - తొండూరు: మానసిక ఒత్తిడి జయిస్తే విజయం తద్యమని ప్రముఖ వ్యాఖ్యాత శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు స్థానిక వెలుగు గురుకుల పాఠశాలలో ఆదివారం స్నేహిత అమృత హస్తం ఆధ్వర్యంలో 10వ తరగతి ఇంటర్ పరీక్షలకు సంబంధించిన అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కరు ఎదగాలి అనుకున్నప్పుడు ఒక నిర్దేశిత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. అటువంటప్పుడే ప్రతి విద్యార్థి అనుకున్నది సాధించే అవకాశం మెండుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తులసమ్మ రాజు సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-జమ్మలమడుగు: బాన శివశంకర్ రెడ్డి 19వ వర్ధంతి సందర్భంగా భార్య బాన లక్ష్మీదేవి, కుమారుడు నాగేంద్ర కుమార్ రెడ్డి,కుమార్తె సునీతా రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జమ్మలమడుగు లోని గాయత్రి వృద్ధాశ్రమం లో అన్నదాన కార్యక్రమం, జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో జ్యోతి మానసిక వికలాంగుల కేంద్రంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.బాన శివశంకర్ రెడ్డి మండల రెవెన్యూ సర్వేలు గా పనిచేసేవారని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఇలా అన్నదానం చేయడం తన సంతోషంగా ఉందని వారు తెలిపారు.

అరటి రైతులను ఆదుకోండి:కాంగ్రెస్

విశాలాంధ్ర - పులివెందుల : ఎన్నడూ లేని విధంగా ప్రకృతి వైపరీత్యాలు తోడవడంతో తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని కాం గ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ వేలూరు శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా సిగటోకా తెగులు రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు. వర్షాలు అధికంగా రావడం గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో సిగటోక తెగులు వ్యాపించింది అన్నారు. తెగులు నివారణ కోసం రక్షణ చర్యలు చేపట్టినా తెగుళ్ల అదుపులోకి రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లింగాల మండలంలో ఎక్కువగా సిగటో క తెగుళ్ల వల్ల కాయలు పక్వానికి రాకపోవడంతో వ్యాపారులు కూడా కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదని ఆయన వాపోయారు. అధికార యంత్రాంగం స్పందించి నష్టపోయిన అరటి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని, అదేవిధంగా తదుపరి సాగుకు ప్రత్యామ్నాయ వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - వల్లూరు : వల్లూరు మండల పరిధి లోని పైడి కాల్వ గ్రామం సమీపంలో కొలువైన శ్రీ రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం నుంచి అరుణ సౌరయనములు, అఘోర రుద్ర మన్యు పాశు పత హెూమము, కళాభివృద్ధి హెూమము, సకల దేవత మూల మంత్ర హెూమము, శాంతి హెూమము, ప్రాయశ్చిత్త హెూమము, శ్రీ సూక్తా పురుష సూక్త హెూమము, మహా పూర్ణాహుతి , మండపోద్వాసము బ్రహ్మ కలశ నయనము, అష్టోత్తర కలశ మహా కుంభాభిషేకము ,దేవత అభిషేకము, తదుపరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాములవారి కళ్యాణం మంగళ హారతి నిర్వహించామని ఆలయ ప్రధాన అర్చకులు హరి నారాయణ స్వామి తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీ వినాయక కిడ్నీ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలో అత్యాధునిక వైద్య వసతులతో శ్రీ వినాయక కిడ్నీ సెంటర్‌ను డాక్టర్ దినేష్ కుమార్ రెడ్డి వారి తల్లిదండ్రుల పూజా కార్యక్రమాలతో ప్రారంభించడం జరిగినది అన్నారు. ఈ మేరకు స్థానిక డిసిసి బ్యాంక్ ఎదురుగా శ్రీ వినాయక కిడ్నీ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని హాస్పిటల్లో పనిచేస్తూ ఎంతో అనుభవమున్న నేను నేడు సొంత గా అన్ని వసలతో కూడిన శ్రీ వినాయక కిడ్నీ సెంటర్ ప్రారంభించడం జరిగిందన్నారు. మా హాస్పి టల్ ప్రత్యేకతలు కిడ్నీలో రాళ్లు, కిడ్నీలో గడ్డలు, మూత్ర సమస్యలు, మూత్రం మంటగా రావడం, మూత్రం ఆగిపోవడం, సెక్స్ సమస్యలు, పిల్లలు పుట్టకపోవడం, బీజం సమస్యలు జర్మనీ పరికరాలతో కోత లేకుండా కుట్లు లేకుండా ఎండోస్కోపీ ఆపరేషన్లు చేయబడును అన్నారు. డబ్బులే ప్రామాణికంగా కాకుండా పేద ప్రజల ఆరోగ్యాన్ని వారి స్థితిగతులు దృష్టిలో ఉంచుకొని వారికి సరైన వైద్య సదుపాయాలు కలవన్నారుఈ కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ డాక్టర్లు స్నేహితులు మిత్రులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం: కాంగ్రెస్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు ప్రీతంరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ పట్ల సవితి తల్లి బుద్ధిని చూపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమ్ముకుంటూ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించవలసిన నిధులను ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమని అన్నారు. కడప బెంగళూరు రైల్వే మార్గానికి కేవలం 10 లక్షలు కేటాయిస్తే ఎన్ని సంవత్సరాలకు అది పూర్తవుతుందో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.ఆంధ్ర ప్రదేశ్లో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పి బీజేపీ మోసం చేసిందని మండిపడ్డారు. కేవలం కార్పొరేట్ సంస్థల చేతుల్లోబిజెపి ప్రభుత్వం ఉందన్నారు.మన రాష్ట్ర ముఖ్యమంత్రి బడ్జెట్లో రాష్ట్రానికి రావాల్సినటువంటి విభజన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకపోయిన కూడా ముఖ్యమంత్రి దానిని ఖండించకపోవడం దారుణమన్నారు.ఏ ఏ రాష్ట్రాల్లో ఎలక్షన్లు వస్తాయో ఆయా రాష్ట్రాలకు అనుగుణంగా బడ్జెట్ను కేటాయిస్తూ వెళతుందని ఇది కేంద్ర బడ్జెట్ కాదు బీజేపీ ఎన్నికల బడ్జెట్ అని విమర్శించారు. నేను విన్నాను నేను కన్నాను అని పలికిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వవలసిన ప్రత్యేక హెూదా గురించి అడిగింది లేదు తెచ్చింది లేదు. ముఖ్యమంత్రి నాకు 25 ఎంపీలు ఇస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా తెస్తానని ప్రగల్భాలు పలికితే ప్రజలు ఆయనను నమ్మి 22 ఎంపీ సీట్లు ఇస్తే ఇప్పుడు పిల్లి లాగా నరేంద్ర మోడీ ముందు మోకరిల్లుతున్నాడని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి మిమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు మీరు ప్రజాక్షేత్రంలో కచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా రావాలన్నా రాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా కేంద్రంలో కాంగ్రెస్ రావాలి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉప అధ్యక్షులు, మధురెడ్డి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు శివ, మాజీ యూత్ జిల్లా అధ్యక్షులు లక్షుమయ్య, లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు పుల్లయ్య, అసిఫ్ ఖాన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కుళ్లాయప్ప, శ్రీనివాసులు, వెంకట రమణారెడ్డి, మహిళ విభాగం, నగర అధ్యక్షురాలు, లావణ్య, లోకేశ్వరి, ఫరూక్, మని, విజయ్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుశీల్, కాంగ్రెస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కర్నాటి చంద్రశేఖర్‌రెడ్డి, కమలాపురం ఓబులేశు గంగాధర్‌లు పాల్గొన్నారు.

ఎగువభద్ర ప్రాజెక్టుతో సీమకు అన్యాయం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : కర్ణాటక రాష్ట్రం లో నిర్మిస్తున్న ఎగువ భద్ర ప్రాజెక్టు ద్వారా రాయల సీమ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5300 కోట్లు కేటాయించడంతో పాటు జాతీయ హెూదా కల్పించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి, కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. తుంగభద్ర నదిపై ఎగువ భద్ర అనే ప్రాజెక్టు ద్వారా మొదటిదశలో 17.4 టీఎంసీలు, రెండవ దశలో 29.9 టీఎంసీల నీటిని ఎగువ ప్రాంతానికి తరలించడం వల్ల తుంగభద్ర డ్యాం దిగువ ప్రాంతంలో ఉన్న ఎల్ఎల్‌సి హెచ్ఎల్‌సి, పోతిరెడ్డిపాడు, రాజోలు బండ, డైవర్షన్స్ స్కీమ్ ప్రాజెక్టులకు నీరు అందదని తద్వారా రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారే అవకా శాలు పుష్కలంగా ఉన్నాయని వారు గుర్తుచేశారు. దిగువ ప్రాంతం లో సుమారు లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరు అందకుండా పోయే ప్రమాదం నెలకొంటుందని వారు గుర్తుచేశారు. కేంద్రం ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించడం మానుకోవాలని లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పక్షాన దశలవారీ ఉద్యమానికి సిద్ధపడతామని వారు హెచ్చరించారు.

అత్యాధునిక పద్ధతిలో శ్రీకర హాస్పటల్ ప్రారంభం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలో అత్యాధునిక వైద్య వసతులతో శ్రీకర హాస్పిటల్‌ను ప్రారంభిం చడం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్ భాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిలు అన్నారు. ఈ మేరకు స్థానిక నారాజుపేటలోని ఉమెన్స్ కాలేజీ ఎదురుగా శ్రీకర హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సాధారణ చిన్న హాస్పిటల్ తో ప్రారంభమైన శ్రీకర్ హాస్పిటల్ నేడు అన్ని వసలతో కూడిన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గా ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్పొరేట్ హాస్పటల్లకు ఏమాత్రం తీసుకొని విధంగా అన్ని రకాల వైద్య సదుపాయాలతో హాస్పిటల్లో స్థాపించిన డాక్టర్ రామానుజుల రెడ్డిని అభినందించారు. డబ్బులే ప్రామాణికంగా కాకుండా పేద ప్రజల ఆరోగ్యాన్నివారి స్థితిగతులు దృష్టిలో ఉంచుకొని వారికి సరైన వైద్య సదుపాయాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివారెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ. 6 కోట్లు మంజూరు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం లోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాల యంలో మౌలిక వసతులు ఏర్పాటుకు రూ. 6 కోట్లు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నూతనంగా ఏర్పాటైన విశ్వవిద్యాల యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేం దుకు నిధులను విడుదల చేశారు.2021 డిసెంబర్ 29న నిర్వహించిన సమావేశంలో విశ్వవిద్యాలయంలో 52ల్యాబ్ ల ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లోని బిల్డింగ్ టెక్నాలజీస్ సర్వీసెస్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ మేనేజ్మెంట్, డిజిటల్ టెక్నాలజీస్ డిజైన్ ప్లానింగ్, టౌన్ ప్లానింగ్ విభాగానికి 28 ల్యాబ్లు, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ లోని పెయింటింగ్, అనిమేషన్, అప్లైడ్ ఆర్ట్, ఫోటోగ్రఫీ, ఆర్ట్ హిస్టరీ, స్కల్ప్చర్, ఇంటీరియర్ డిజైన్ విభాగానికి 24 ల్యాబ్లను ఏర్పాటు చేసేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో మొత్తం 52 ల్యాబ్ ల ఏర్పాటు చేసేందుకు దానికి సంబంధించిన మెటీరియల్ కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల చేశారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయంకు నిధులు కేటాయించడం పట్ల విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య ఫజుల్ రెహమాన్, రిజిస్ట్రార్ ఆచార్య ఈ.సీ. సురేంద్రనాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషిచేసిన కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డికి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

తురుకపల్లెలో ఘనంగా ఉసుమహెూత్సవం



విశాలాంధ్ర - కమలాపురం : మండల పరిధి లోని తురుకపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ హజరత్ సయ్యద్ మహమ్మ ద్ షా స్వామివారి ఉరుసు మహెూత్సవం వైభవంగా ఆదివారం నిర్వహించారు. గ్రామ ప్రజలు దర్గా కమిటీ సభ్యులు నడుమున స్వామివారికి మహెూత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రొద్దుటూరు కమలాపురం కడప జమ్మలమడుగు తదితర ప్రాంతాలకు చెందిన స్వాముల పరిరక్షణలో స్వామివారికి గంధం తయారు చేశారు పవిత్రమైన గంధాన్ని ప్రత్యేక బిందెలో నింపి పూలమాలలతో అలంకరించారు. తలపై పెట్టుకుని గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు స్వామివారి జెండాతో పాటు గంధం ఊరేగింపు నేల తాళాలు డప్పు వాయిదా సంచారాలు పేల్చుతూ గ్రామ వీధుల్లో ఊరేగింపు కార్యక్రమం కొనసాగాయి. అంతకుముందే యువత వివిధ రకాల నృత్యాలు చేశారు ఊరేగింపు త్వరగా చేరుకున్న అనంతరం జెండా చెట్టు వద్ద జెండాను ప్రతిష్టించారు. స్వామివారు మజార్ పై గంధం ఎక్కించి పూల చందర్లు సమర్పించారు ప్రత్యేక పాతిహా నిర్వహించారు అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



నిరంతర సేవే మానవతా సేవా సంస్థ లక్ష్యం

విశాలాంధ్ర -రాజంపేట: నిరంతర సేవా కార్యక్రమాలే మానవతా సేవా సంస్థ లక్ష్యమని అధ్యక్షులు వై నందకిషోర్ గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని సరస్వతి విద్యా మందిరంలో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజల సంక్షేమానికి పాత బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో విరామం కోసం బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. వేసవిలో ఎండల తీవ్రతం దృష్టిలో పెట్టుకుని మూగజీవాల సంక్షేమానికి రాపూరు అటవీ ప్రాంతంలో తాగునీటి తొట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే మానవతా సేవా సంస్థ సభ్యులైన పతకమూరి వెంకటరమణ సతీమణి మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యా యులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన శంకర్ రాజును సంస్థ తరఫున సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు నంద కిషోర్, యు పి రాయుడు, గౌరవ అధ్యక్షులు తుంగా రమణా రెడ్డి, పి. వెంకట రమణ, గౌరవ డైరెక్టర్లు బి. శ్రీనివాసుల నాయుడు, పి. సి యన్ మూర్తి, శివరాజు, గంగనపల్లి రమణ, అబ్దుల్లా, రమణయ్య, సంస్థ శాశ్వత సభ్యులు మేడా బాలకృష్ణ రెడ్డి, పథకమూరి విష్ణు వర్ధన్, సభ్యులు సుబ్బరాయుడు, శరత్ కుమార్, చిట్టి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దాయాదుల మధ్య ఘర్షణ

విశాలాంధ్ర-గాలివీడు : అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం పందికుంట దేవరపల్లి గ్రామంలో ఆదివారం నీలా నంద్రరెడ్డి (వయస్సు 55) అనే వ్యక్తిపై భూ తగాదా పొలాలకు వెళ్లే దారి వివాదంలో దాయాదులు దాడి చేయడం వలన తలకు తీవ్ర రక్త స్రావం జరిగిందని, వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం అతనిని తిరుపతి రిమ్స్ కు తరలించడం జరిగిందని బంధువులు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకట శివప్రసాద్ తెలిపారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

విశాలాంధ్ర-పీలేరు : పీలేరు సదుం రోడ్ లో వెలసిన వీరాంజనేయ స్వామి వారి దేవస్థానమునందుఆదివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి వ్రతము జరిగినది. ఈ కార్యక్రమములో ముందుగా గణపతి పూజ, నవగ్రహ పూజ, పంచపాలక, అష్టదిక్పాలక పూజలతో శ్రీ రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకము, అష్టోత్తర శతనా మావళి పురాణోక్తంగా జరిగినది. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించబడినది. ఈ కార్యక్రమం లో ఆలయ అర్చకులు రాజు స్వామి, ఉద్యా ఫణీంద్ర శర్మ, సూత్రం కిరణ్ కుమార్ శర్మ మరియు భక్తాదులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

విశాలాంధ్ర-పీలేరు:- ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీలేరు మండలం రేగళ్ళు పంచాయతీ బోయపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలి తండ్రి బాబు రెండవ కుమా ర్తె అయిన శిరీష (21) చదువు ముగించుకొని ఇంట్లోనే ఉంటుంది.అయితే శిరీష అక్క రాధికాకు వివాహమై ఆమె భర్త రెడ్డి ఇంట్లోనే ఇల్లరికంగా ఉంటున్నారు.ఈ నేపథ్యంలో శిరీష, రాధిక, రెడ్డిల మధ్య కొన్ని కారణాల వల్ల మనస్పర్థలు రావడంతో జీవితంపై విరక్తి చెంది శిరీష ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు ఆరోపిస్తున్నారు. పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడే అభయాంజనేయ స్వామి విగ్రహంప్రతిష్ట

విశాలాంధ్ర-రామాపురం : అన్నమయ్య జిల్లా, రామాపురం మండలం, సరస్వతిపల్లె హరిజనవాడలో శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి నూతన విగ్రహం నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పిల్లిండ్ల సుబ్బరాయుడు, ఆయన మనవడు రామాపురం మండలం తెలుగు యువత ఉపాధ్యక్షుడు పెండ్లిండ్ల మహేష్‌లు తెలిపారు. ఈప్రారంభోత్సవం కార్యక్రమానికి గ్రామ ప్రజలు మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వైభవంగా జనార్ధన స్వామి రథోత్సవం

విశాలాంధ్ర -రామసముద్రం: మండల కేంద్రమైన రామసముద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది . ఆలయ అర్చకులు కులశేఖర్ బట్టర్ స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చన నిర్వహించారు. స్వామి వారు రథోత్సవం పై కనుల పండుగ ఊరేగారు కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం భక్తులకు సాంప్రదాయ బద్ధంగా ఏటేటా మాదిరిగానే భక్తులకు పెద్ద ఎత్తున ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రామచంద్ర యాదవ్ స్వామివారి సేవలో పాల్గొని తన మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధికి పది లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు.

ఎద్దు పొడిచి మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -మదనపల్లి : ఎద్దు పొడిచి ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లి మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మదనపల్లి మండలంలోని బసనకొండ పంచాయతీ రామా చర్లపల్లికి చెందిన నిర్మలమ్మ 60 పాడియావులను మేపుకొని రావడానికి ఊరికి సమీపంలోని పొలాల వద్దకు వెళ్ళింది. సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో పొరుగింటి ఎద్దు ఆవు మీదకి రావడంతో అడ్డుకున్న నిర్మలమ్మను పొడిచింది. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలని చికిత్స నిమిత్తం హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి: కలెక్టర్

- హోరాహోరీగా సాగిన కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ - విజేతగా ఎస్ పి జట్టు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. ఆదివారం కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం నందు అన్నమయ్య జిల్లా, కలెక్టర్ వర్సెస్ ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని నిండు నూరేళు ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఈ క్రికెట్ పోటీలలో ఓడినవారు నిరుత్సాహం చెందకుండా నెక్స్ట్ మ్యాచ్ లో గెలవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి కడప మాస్టర్స్ క్రికెట్ క్లబ్ తరఫున క్రికెట్ కిట్, 50 మందికి క్రికెట్ యూనిఫామ్ అందజేయడం ఎంతో శుభపరిణామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు క్రికెట్ బాగా ఆడి గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ.... కలెక్టరేట్ సిబ్బంది ఎస్పీ కార్యాలయ సిబ్బంది మంచి స్పోర్టివ్ గా క్రికెట్ మ్యాచ్ ఆడడం జరిగిందన్నారు. మనం విధి నిర్వహణలో ఉన్నప్పటికీ క్రికెట్ మ్యాచ్ ఇంతటితో ఆపకుండా క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తూ క్రికెట్ ఆడుతూ ఉండాలన్నారు. దీంతో శరీర దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఎస్పీ టీం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఇందులో కలెక్టర్ టీంకు కలెక్టర్ కెప్టెన్‌గా ఎస్పీ టీమ్‌కు ఎస్పీ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈ క్రికెట్ మ్యాచ్ రెండు జట్ల మధ్య హెరారా హెరారీగా కొనసాగింది. మొదటగా ఎస్పీ టీం బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 176 రన్‌లను సాధించింది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కలెక్టర్ టీం 151 పరుగులు చేసి 19.5 ఓవర్లలో ఆలౌట్ కావడం జరిగింది. జిల్లా కలెక్టర్ 3 రన్స్ ఎస్పీ 5 రన్స్ చేసి క్రీడాకారులను, చూపరులను ఆకట్టుకున్నారు. ఎస్పీ టీమ్ కు చెందిన శ్రీనివాస్ 66 పరుగులు, 2,వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. కలెక్టర్ టీం కు చెందిన పెంచలయ్య 5 ఫోర్లు, ఒక 6 మొత్తం 38 పరుగులతో బెస్ట్ బ్యాట్స్మెన్ గా నిలిచారు. బెస్ట్ బౌలర్ గా హేమంత్ రెడ్డి నిలిచారు. ఈ మ్యాచ్ లో ఇన్స్పైరింగ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, బెస్ట్ కెప్టెన్ ఆఫ్ ది టోర్నమెంట్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు, నిలిచారు. విన్నర్స్ ఎస్పీ టీం, రన్నర్స్ కలెక్టర్స్ టీంగా గెలిచారు. ఇందులో విన్నర్స్, రన్నర్స్ క్రికెట్ విజేతలకు జిల్లా కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా కడప మాస్టర్స్ క్రికెట్ క్లబ్ తరఫున మెడల్స్, మెమెంటోలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి అనుబంధ మహోత్సవానికి తరలిరండి.

విశాలాంధ్ర-పీలేరు: రెడ్డి అనుబంధ మహోత్సవానికి తరలి రావాలని రాష్ట్ర రెడ్డి సంఘం సభ్యులు సత్యనారాయణ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాటలాడుతు తిరుపతి తూకి వాకం ఆర్ పి ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న రెడ్డి అనుబంధ మహోత్సవం కార్యక్రమం జయప్రదం చేయాలని రెడ్డి జె ఏ సి నాయకులు, సంఘం సభ్యులు తరలి రావాలని రాష్ట్ర రెడ్డి సంఘం సభ్యులు పులి సత్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. కలికిరి పట్టణం ధరణి హోటల్ దగ్గర నుండి సుమారు వందమంది రెడ్డి సంఘం నాయకులు తమ వాహనాలతో ర్యాలీగా కలికిరి పట్టణంలోని ఎల్లమ్మతల్లి గుడి దగ్గరకు చేరుకొని దర్శనాంతరం తిరుపతి రెడ్డి అనుబంధ మహోత్సవ కార్యక్రమానికి వెళ్లారు.రెడ్ల ఐక్యతే లక్ష్యంగా పేద రెడ్ల సంక్షేమమే ధేయంగా భవిష్యత్తులో మరింత ఐక్యతతోసంఘాన్ని బలోపేతం చేయాలని అన్నారు.అందుకు మండలాల వారిగా మీ సహాయ సహకారాలు అందించాలని మీకు ఏసమస్య వచ్చినా రెడ్డి జె ఏ సి నాయకులు, కార్యవర్గం అండగా ఉంటుందని తెలిపారు.రెడ్డి సంఘానికి భవిష్యత్తు లో మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ రాం ప్రసాద్ రెడ్డి, ఆది నారాయణ రెడ్డి, గంగిరెడ్డి, సుధాకర రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, శేష్ కుమార్ రెడ్డి, శివారెడ్డి. భాస్కర రెడ్డి.సహదేవ రెడ్డి, సుధీర్ రెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, రామాంజులు రెడ్డి, మధు రెడ్డి, ప్రభాకర రెడ్డి, మహాత్మ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శీఆదిగంగమ్మ విగ్రహం ప్రతిష్ట

విశాలాంధ్ర-కెవిపల్లి : మండలములోని జీళ్ళేళ్ళ మంద పంచాయతి, ఫేండ్లిఫేంట గ్రామంలో, నూతనంగా గంగమ్మతల్లి దేవత, విగ్రహాన్ని, ఆదివారం వైస్సార్సీపీ కాంగ్రెస్ నేత ,జీవీ, శ్రీనాదరేడ్డిని అహ్వానించి ఆతని చేతు లు మీదుగా, వేదపండితులతో పూజలుజరిపి ఆలయాన్ని ప్రారంబించారు. ఆదే క్రమంలో మండల వై.యస్ఆర్ పార్టీ కన్వీనర్, వేంకట రమణారేడ్డి, జెడ్పిటీసి,గజ్జెల, శృతి శీన్ రెడ్డి గ్రామసర్పంచ్, కార్యకర్తలు, సిరీ, రాజేంధ్ర, మహిళలుఆధికసంఖ్యలోపాల్గోన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : జగనన్న లబ్ధిదారులకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఆరు ఫిబ్రవరి 2023న సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, గంగాపూరి సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జగదాబి సుబ్రహ్మణ్యంరాజు, మండల ప్రధాన కార్యదర్శి జయసింహ, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర ఇంటీరియర్స్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రామాపురం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శుద్ధమళ్ళ గ్రామం, ఓబుళరెడ్డిగారిపల్లికి చెందిన రామన్ వెంకట్నారాయణ రెడ్డి కుమారుడు వెంకట సుబ్బరెడ్డి నూతనంగా వేదసా ఎంటర్ప్రైజెస్ శ్రీ వెంకటేశ్వర ఇంటీరియర్స్ ను ఆదివారం లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతు ఈ ఇండస్ట్రియల్ రామాపురంలో ఏర్పాటు చేయటం సంతోషదాయకం అన్నారు. సెక్టార్‌లో వివిధ ఫర్నిచర్‌ల ఉత్పత్తి మరియు పరుపులు, బ్లైండ్‌లు, క్యాబినెట్‌లు మరియు లైటింగ్ వంటి అన్ని ఇతర సంబంధిత ఉత్పత్తులు ఈ రంగంలో తయారు చేయబడిన వస్తువులు క్రియాత్మకమైనవని అన్నారు. వివిధ రకాల తయారీ యంత్రలను మన రామాపురం మండలంలో ఏర్పాటు చేయటం వల్ల ఉపాధి లభిస్తుందన్నారు. కస్టమర్ లకు నాణ్యమైన పర్నిచర్ ను అందించి వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతూ తనదిన మార్క్ తెచ్చుకోవాల అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాసన వెంకటరమణ, సర్పంచ్ నాగభూషన్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి,శ్రీధరరెడ్డి, మర్రెడ్డి భాస్కర్ రెడ్డి,సుకుమార్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి పాల్గుణ రెడ్డి,శంకర్ రెడ్డి, ఆంజనేయులు, గోవర్ధన్ రెడ్డి, చందు, చింటూ పాల్గొన్నారు.

ఇండియా స్థాయిలో వాలీబాల్ పోటీలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: ఆంధ్రప్రదేశ్ లోని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలో కడప-రేణిగుంట జాతీయ రహదారి ప్రక్కన మాధవరంపోడు గ్రామం వద్ద రైల్వేగేట్ పక్కన 10 ఫిబ్రవరి 2023 తేదీ శుక్రవారం మరియు శనివారం రెండు రోజులు పాటు హెరాహెరారీగా పగలు రాత్రి ఆల్ ఇండియా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని మాధవరంపోడు క్షత్రియ వాలీబాల్ అసోసియేషన్ వారు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి 70,116, ద్వితీయ బహుమతి 40,116, తృతీయ బహుమతి 20,116 చతుర్ధ బహుమతి 9,999 లను బహుమతులను విజేతలకు అందజేసి ప్రముఖులచే అభినందించనున్నారు.ఎంట్రీ ఫీజు 999 రూపాయలు గా నిర్ణయించారు. నమోదు చేసుకోవడానికి 8 ఫిబ్రవరి 2023న బుధవారం సాయంత్రం 4 గంటల లోపల నమోదు చేసుకోవాలన్నారు.పూర్తి వివరాల కోసం 9705343689, 9441150472, 9985321144 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చేపల మార్కెట్ ప్రారంభం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు నియోజకవర్గం కలికిరి పట్టణం నల్లారి తిమ్మా రెడ్డి కాంప్లెక్స్ వెనుకాల ఆదివారం ఉదయం అఫ్జల్ చేపల మార్కెట్ సీనియర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి మరియు కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డి వారి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణం నడిబొడ్డున తాజా చేపలు 24 గంటలు అందుబాటులో పెట్టి అమ్మడం చాలా ఆనంద దాయకం అని అన్నారు ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సింది గా నిర్వాహకులు అఫ్జల్ కోరారు.

అనాథ ఆశ్రమానికి వితరణ

విశాలాంధ్ర-మదనపల్లి : ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల నందు ఏం.సి.ఏ విభాగము వారు మదనపల్లె లోని కూరపర్తి సాయి చైతన్య స్రవంతి ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అనాథ శరణాలయానికి సుమారు 13000 రూపాయల విలువైన తునుబండారాలు తో పాటు సబ్బులు, బిస్కెట్స్, బ్రేషులు మొదలైనవి అందజేశారు. ఏం.సి.ఏ కు చెందిన విద్యార్థులు మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరాజ్, డాక్టర్ మరథముత్తు లు కలిసి అక్కడ వున్నా పిల్లలతో కొంతసేపు ముచ్చటించడం జరిగింది. కార్యక్రమం లో శివరాజ్ మాట్లాడుతూ చదువు అనేది ప్రతి ఒక్కరికి వారి భవిష్యత్తు కు కావలసిన బాటలను వేస్తుందని, ప్రతి ఒక్కరు బాగా చదివి ఉన్నత స్థానాలు అధిగమించాలని ఆయన అన్నారు. మేము ఒంటరి వాళ్లము అనే విషయాన్నీ మరువాలని, ప్రతి ఒక్కరికి తోడుగా దేవునితో పాటు మేమందరం ఉన్నామని గ్రహించాలని అన్నారు. ప్రతి ఒక్కరు స్నేహభావం కలిగి అందిరితోను కలిసిమెలసి ఉండాలని ఆయన అన్నారు.

కార్యకర్తలను అన్ని విధాలు ఆదుకుంటాం

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని రాచపల్లి పంచాయతీ నాయునివారిపల్లెలో ఇటీవల టిడిపి కార్యకర్త మల్లికార్జున నాయుడుపై వైసిపి కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మల్లికార్జున నాయుడుని ఆదివారం రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ ఆర్. రమేష్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మల్లికార్జున నాయుడు ఆరోగ్య పరిస్థితులను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు త్వరగా కోలుకొనే విధంగా మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. తమకు అండగా ఉంటామని బాధితునికి అన్ని విధాల ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మదనమోహన్. గంగిరెడ్డి. కిరణ్ కుమార్ రెడ్డి. రవీంద్రనాథ్ రెడ్డి, ఖాసింపీరా పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు, టీటీడీ మాజీ పాలకమండలి సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని పెమ్మాడపల్లె బాగాతమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఅమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ బాబును ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండల పరిధిలోని బొట్లచెరువు గ్రామంలో శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆహ్వానించిన హెమనవర్మ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నియోజకవర్గ అసెంబ్లీ కేంద్రం కోడూరు మండలంలోని మాధవరంపోడు గ్రామ పంచాయితీ కేంద్రంలో ఈనెల 10 ఫిబ్రవరి 2023న శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యే ఆల్ ఇండియా వాలీబాల్ పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావాలని ఆదివారం రాష్ట్ర క్షత్రియ నాయకులు ముప్పాల హెమనవర్మ, అదిరాజు వేణుగోపాల్ రాజు,మాధవరం పోడు హెం టీం క్రీడాకారులు కలిసి అన్నమయ్య జిల్లా కేంద్రానికి వెళ్ళి జిల్లా కలెక్టర్ గిరీష కు, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆఫీసర్ (ఎస్పీ) హర్షవర్ధన్ రాజు లను ఆహ్వానించారు.తప్పకుండా వస్తామని హమీ ఇచ్చారు.

గోల్డ్ మెడల్ సాధించిన గౌతమ్ విద్యార్థులు

విశాలాంధ్ర-గాలివీడు: మహారాష్ట్ర రాష్ట్రం షిర్డీలో జరిగిన నేషనల్ చాంపియన్ షిప్ జంప్ రోప్ విభాగంలో ముగ్గురు గౌతమ్ విద్యార్థులు బంగారు పథకాలు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మన్యుల్,సైజు థామస్ పేర్కొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజులుగా జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరచిన రెడ్డి వినోద్,నంద కిషోర్,వాసు నాయక్ లు బంగారు పథకాలు సాధించగా,తేజ,హనీష్ లు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. వీరిలో వాసు నాయక్ అమెరికాలో జరగబోవు అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.వ్యాయమ ఉపాధ్యా యులు హరి కృష్ణ, ఎంపికైన విద్యార్థులను యాజమాన్యం అభినందిం చారు.ఇంతటి ఘనవిజయం సాధించి తల్లిదండ్రులు,పాఠశాల పేరును జాతీయ స్థాయిలో వినిపించిన విద్యార్థుల క్రీడా ప్రతిభ పాటవాలు అద్వితీయామని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోవుల సంరక్షణకు పశు గ్రాసం, నీటితోట్లు ఏర్పాటు కదిలించిన విశాలాంధ్ర కథనం

విశాలాంధ్ర - రాజంపేట: గోవులను భక్తి భావంతో పూజించే మన సమాజంలో వాటికి రక్షణ లేకుండా పోతోం దని శనివారం విశాలాంధ్ర దినపత్రికలో రహదారులే.. మా అడ్డా.! నడిరోడ్లపై విశ్రమిస్తున్న మూగజీవాలు అనే కథనం వెలుబడింది. ఈ కథానికి స్పందించి ఇటీవల నూతనంగా ఏర్పడిన గో సంరక్షణ సేవాసమితి ఉపాధ్యక్షులు శ్రీకాంత్ స్టూడియో అధినేత వర్ధిబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలో గోవుల సంరక్షణకు 13 చోట్ల త్రాగునీటి తొట్లను, పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా గో సంరక్షణ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనారోగ్యాలకు గురువుతున్న పశువులకు షెల్టర్ ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తామన్నారు. అధికారులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షణ సేవాసమితి సభ్యులు శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, డొంక సురేష్, వరదయగారిపల్లి గోశాల అధినేత నర్సారెడ్డి, రవిచంద్ర ప్రసాద్, మల్లిశెట్టి నరసింహులు,అకూరు రాజ,బాలాజీ,పీరు మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12న మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రాజంపేట: మార్చి 12వ తేదీన అన్నమయ్య జిల్లా రాజంపేట కళాంజలి గార్డెన్‌లో జరిగే మాలల సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా జేఏసీ నాయకులు లింగం సంజీవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో కార్యచరణ ప్రణాళికను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింహగర్జన ద్వారా మాలల హక్కుల సాధన కొరకు మాలలపై జరుగుతున్న దాడులను గురించి వివక్షత గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. సింహగర్జన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మాల సంఘాల నాయకులను, సంస్థల అధ్యక్షులు రావడం జరుగుతుంది అన్నారు. భారీ స్థాయిలో కడప అన్నమయ్య జిల్లాలలో అన్ని మండలాల నుండి మాలలను అందరినీ కలుపుకొని విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జేఏసీ కన్వీనర్ లింగం సంజీవ్, రైల్వే కోడూరు జేఏసీ కన్వీనర్ చోడవరం సుబ్బు నర్సయ్య, నందలూరు జేఏసీ కన్వీనర్ ఏ విశ్వనాథ్, నందలూరు జేఏసీ కన్వీనర్ ఇరువూరి శివయ్య, చిట్వేలు జేఏసీ కన్వీనర్ పొల్లం రెడ్డి మల్లికార్జున, రైల్వే కోడూరు జేఏసీ కన్వీనర్ కూని నారాయణ, చిట్వేలి జేఏసీ కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, పుల్లంపేట జేఏసీ కన్వీనర్ గాలిశెట్టి సుధాకర్, పెనగలూరు జేఏసీ కన్వీనర్లుగా పెనుబాల జయరామయ్య, గాలిశెట్టి శివశంకర్, శంకరయ్య, రాజంపేటకు కన్వీనర్లుగా సి నర్సింహులు, ఏ బాలయ్య, బి హరినాథ్, ఎస్ సుబ్బయ్య ఆర్ చందు, ఓ శ్రీనివాసులు, కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-చిన్నమండెం: అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్న దళితుల సమస్యలను పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఏపీ దళితమిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని కలిబండ హరిజన వాడ, మాలపల్లె తదితర గ్రామాల్లో పల్లె పిలుపు కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఆయన వెంట రాయలసీమ ఇన్చార్జ్ నాగభూషణం, రెండు జిల్లాల ఇన్చార్జి నాగేశ్వర్, జిల్లా అధ్యక్షులు కిశోర్ బాబు, జిల్లా ఉపాధ్య క్షులు వీరయ్య, ప్రచార కార్యదర్శి రెడ్డప్ప, కార్యదర్శి మధుసూధన్, పట్టణ అధ్యక్షుడు లోకేష్, చిన్నమండెం మండల అధ్యక్షులు నరసింహు లు, ఉపాధ్యక్షులు శంకరయ్య, రెడ్డిప్రసాద్, వెంకటేష్, అజయ్కుమాడ్, రాంప్రసాద్, అంజనమ్మ పాల్గొన్నారు.

నారాలోకేష్ యువగళం పాదయాత్ర కమిటీలో కె కె చౌదరి

విశాలాంధ్ర-చిట్వేలి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుప్పం నుంచి ఇచ్చాపురం వరకు 400 రోజులు 4000 కిలోమీటర్ల లక్ష్యంగా చేపట్టిన "యువగళం" పాదయాత్ర కమిటీలో చిట్వేలి మండలం తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు మరియు రాష్ట తెలుగుయువత ఉపాధ్యక్షులుగా వున్న కె కె చౌదరి కి అవకాశం దక్కింది. గత వారం రోజులుగా పాదయాత్రలో నారా లోకేష్‌తో కలిసి నడుస్తున్నారు. కె కె చౌదరి మాట్లాడుతూ పాదయాత్రలో భాగస్వామ్యం అయ్యే గొప్ప అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలలో పెను మార్పులు తీసుకువస్తుందన్నారు.

అంబేద్కర్ ను అవమానించి నోళ్లకు కాంగ్రెస్ మద్దతివ్వడం సిగ్గుచేటు

- దీనిపై రాహుల్ గాంధీకి పిర్యాదు చేస్తాం
- వీసీకే పార్టీ నేత పీటీయం శివప్రసాద్ హెచ్చరిక

విశాలాంధ్ర -మదనపల్లి: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో, అడుగడుగునా అయన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బొమ్మను నెత్తిన పెట్టుకొని కీర్తిస్తూ వెళితే, మదనపల్లెకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు మాత్రం తమ అధినేత ఆలోచనలకు భిన్నంగా వ్యవహరిస్తూ, అంబేద్కర్ ను అవమానించినోళ్లకు మద్దతు తెలుపుతూ నిస్సిగ్గుగా ఆందోళనలు చేస్తున్నారని, వీరు వెంటనే తమ వైఖరి మార్చుకోక పోతే, దీనిపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి పిర్యాదు చేస్తామని, అవసరమైతే వీసీకే పార్టీ ఎంపీల ద్వారా ఈ విషయాన్ని పార్లమెంటు దృష్టికి తీసుకెళ్తామని వీసీకే పార్టీ ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ స్పష్టం చేశారు. మదనపల్లె పట్టణం లోని బైపాస్ రోడ్డుకు సమీపంలోని చంద్రాకాలనీకి ముందు భాగంలో గల కాలనీకి గత 25 ఏళ్ల క్రితమే అంబేద్కర్ నగర్ గా నామకరణం చేసి, ఇనుప నేమ్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, కొన్నేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ నేత షాజహాన్ బాషా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇక్కడ మరికొంత మందికి ఇండ్లు మంజూరు చేయగా, అంబేద్కర్ పట్ల కుల వివక్షతా భావంతో వారు దానికి అంబేద్కర్ నగర్ అనే పేరును తొలగించి, జహా చేనేత నగర్ అనే పేరు పెట్టి, అంబేద్కర్ ను అవమానించారని పేర్కొన్నారు. ఇదే కాలనీలో బైపాస్ రోడ్డు ప్రక్కన 25 ఏళ్ల క్రితం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం ఒక దిమ్మెను నిర్మించి, దానిపై అంబేద్కర్ బొమ్మ ఏర్పాటు చేసి, అక్కడ అంబేద్కర్ జెండాను ఎగురవేయడం జరిగిందని, అప్పటి నుండి ఏటా అంబేద్కర్ జయంతి, వర్ధంతులకు అంబేద్కర్ అభిమానులు అక్కడికి చేరి, అంబేద్కర్ బొమ్మకు దండలు వేసి నివాళులు అర్పించడం జరుగుతోందని తెలిపారు. అయితే తాజాగా గతనెల 31వ తేదిన ఇదే కాలనీకి చెందిన భాస్కర్, శ్రీనివాసులురెడ్డి మరికొంతమంది కలిసి ఈ భూమిని కబ్జా చేయాలన్న దురుద్దేశంతో ఆ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి అంబేద్కర్ బొమ్మను, దిమ్మెను ధ్వంసం చేసి, అశోక ధర్మ చక్రం కలిగిన అంబేద్కర్ జెండాను కాల్చి బూడిదచేశారని తెలిపారు. దీనిపై అక్కడి దళితులు మదనపల్లె రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసి, న్యాయం కోసం ఆందోళన చేస్తుంటే దళితులకు వ్యతిరేకంగా, నిందితులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి సంబందించిన నాయకులు కొందరు ఆందోళన చేపట్టడం వెనుక అంతర్యం ఏమిటని అయన ప్రశ్నించారు. అంబేద్కర్ పట్ల, దళితుల పట్ల కుల వివక్షతతో ఇదంతా చేస్తున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని శివప్రసాద్ తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం అయన స్థానిక బాస్ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు.

సమస్యలు పరిష్కారం కావాలంటే ఒంటేరును గెలిపించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలంటే ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి గారిని టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(%ూ్రాఖూ%) కార్యాలయంలో పశ్చిమరాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికలలో అమలుచేయాల్సిన వ్యూహంపై ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి గారికి మద్దతు ఇస్తున్న వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయులు చాలా మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసారు.ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని వారు తెలియచేసారు. ఒంటేరు మాటాడుతూ ఏకీకృత సేవా నియమాల గెజిట్ సాధించపెట్టడం జరిగినదని,కాని ఇంతవరకు అమలుకు నోచుకోలేదని వీటి అమలుకు కృషిచేస్తానని తెలియచేసారు.దాదాపు 13వేల పండిత,పిఇటి ఉన్నతీకరణకు కృషి చేసి సాధించిపెట్టడం జరిగినదని,మిగిలిన పండిత,పిఇటీల ఉన్నతీకరణకు కూడా కృషి చేస్తానని తెలియచేసారు. అలాగే మోడల్ స్కూల్స్ ప్రభుత్వంలో విలీనం,టీచర్లకు 010 పద్దు జీతాల చెల్లింపునకు కృషిచేస్తానని తెలియచేసారు. రాబోవు పశ్చిమరాయలసీమ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు మద్దతు ఇచ్చి మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్జెయుపి సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి,శ్రీనివాసులు, ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శి నరసింహులు,ఎపిటియఫ్ నాయకులు హరిబాబు,యస్ యల్ టి ఎ నాయకులు గంగాధర్,ఎపిసిపయస్ఇఎ రాష్ట్ర నాయకులు జనార్ధన్ రెడ్డి,మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.శివశంకర్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు గోపాల కృష్ణ గౌడ్,ఆపస్ జిల్లా నాయకులు రామాంజనేయులు రెడ్డి,రామేశ్వర్ ,వెంకటేశ్వర్లు,మధుమతి,ఆర్జెయుపి నాయకులు వెంకటసుబ్బయ్య, రెడ్డన్న, ఎపిసిపియస్ ఇఎ జిల్లా నాయకులు శ్రీనివాసులు,ఉపాధ్యాయ నాయకులు జనార్ధన్, సంజీవరెడ్డి,వివిధ ఉపాధ్యాయులు మొ.గు వారు పాల్గొన్నారు.

అయ్యయ్యో బ్రహ్మయ్య...ఏందయ్య ఈ గోల!

యాచకులతో భక్తుల భయాందోళన

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: అయ్యయ్యో బ్రహ్మయ్య..పుణ్యక్షేత్రంలో గోళ ఏందయ్య రోడ్లపైకి వచ్చిన అంగళ్ళు, పవిత్రంగా బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు భక్తులు నలుమూలల నుండి దర్శనం చేసుకునేందుకు రావడంతో యాచకులు చిల్లర కోసం వారిని వెంటపడుతు వేధిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని భక్తులు బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు కూడ భయపడుతున్నారని వీరిని అదుపుచేసే అధికారులు లేకపోవడంతో యాచకులు, అంగళ్ల యాజమాన్యాలు రోజురోజుకు చెలరేగిపోతున్న అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ పరిధిలో ఉన్న పురవీధుల్లో అంగళ్లు డ్రైనేజి కాలువ నుండి ముందుకు సాగి రోడ్లపైకి గూడారాల మాదిరి ఏర్పాటుచేసుకొని భక్తులు ఇబ్బందులకు గురౌతున్నారు. అదేవిధంగా పవిత్రంగా ఉన్న స్వామి పురవీధుల్లో ఆలయ ఎదురుగా దుకాణ అంగళ్లలో సిగరెట్లు, బీడీలు అమ్మకాలు కొనసాగుతున్నాయి. వాటిని తొలగించేందుకు అధికారులు చొరవ చూపించాలని యాచకులు గోళ కూడ ఎక్కువై పెద్దల నుండి చిన్నారుల వరకు భక్తులు వెంటపడి వేధిస్తూ చిల్లర ఇవ్వకపోతే వారిని శాపాలు పెడుతూ భక్తులకు భయాందోళణ చేస్తున్నారు. వీరిని అధికారులు కంట్రోల్ చేయాలని భక్తులు కోరుకుంటున్నారు. ఆవులు కూడ రోడ్లపై ఉండటంతో వచ్చిన భక్తులకు కూడ ఇబ్బందిగా మారుతూ తోపులాటలో భక్తులకు గాయాలు కూడ అవుతున్నాయని, ఆవులను కూడ గోశాల మాదిరి ఏర్పాటుచేసి తరలించేవిధంగా చూడాలని భక్తులు తెలియజేస్తున్నారు.

ప్రసాద్ సినిమా థియేటర్ క్యాంటీన్ యజమానిపై దాడి

- కేసు నమోదు

విశాలాంధ్ర-పీలేరు: పీలేరునియోజకవర్గంలోని కలికిరి టౌన్ లో గల ప్రసాద్ సినిమా థియేటర్ నందు క్యాంటీన్ నడుపుకొంటున్న వేమా రెడ్డి పై గత గురువారం అర్ధరాత్రి దాటిన సమయంలో తాగిన మైకంలో చిప్స్ పాకెట్స్ కోసమని టెలిఫోన్ ఎక్ఛేంజ్ వీధికి చెందిన మహమ్మద్ షామీర్ సినిమా తలుపులు తోసి, క్యాంటీన్ తలుపులు తన్ని దౌర్జన్యంగా లోపలికి వెళ్లగా, రెండవ ఆట సినిమా అయిపోయి చాలా సేపు అయి, సినిమా హాలు కూడా మూశాక కూడా నీవు లోపలికి ఎలా వస్తావని వేమా రెడ్డి అడగడంతో అతనిని చేతులతో కొట్టి, కాళ్లతో తన్ని దాడి చేసి, చంపుతానని బెదిరించారు. ఈ విషయమై పెద్ద మనుషులు తనకు సరియైన న్యాయం చేయనందున, బి .వేమా రెడ్డి కలికిరి పీఎస్‌లో ఆదివారం రిపోర్టు చేయగా కలికిరి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ.సీ లోకేశ్ రెడ్డి ఆదేశాలపై ఏఎస్ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్ఎమ్స్ కు ఆన్ లైన్ యాపులుపనిభారం తగ్గించాలి

- ఫీల్డ్ వర్క్ చేయడానికి అవకాశం కల్పించాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎమ్స్ లకు కేటాయించిన ఫీల్డ్ వర్క్ చేయడానికి ఇబ్బందిగా ఉన్న ఆన్ లైన్ యాపులు తగ్గించి, పనిభారం తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏఎన్ఎమ్స్ లు మదర్ అండ్ చైల్డ్ సర్వీసెస్, ఫీల్డ్ వర్క్ లో భాగంగా వివిధ సర్వేలు చేయడానికి, ఇబ్బందిగా ఉన్న ఆన్ లైన్ యాపులు తగ్గించాలని కోరారు. అనవసరమైన యాపులల్లో రోజు వర్క్ అప్లోడ్ చేయడానికి, దానికి తోడు బయో మెట్రిక్ రోజుకు మూడు సార్లు వేయడానికే పగలంతా సమయం సరిపోతుందని,ఇతర ఫీల్డ్ వర్క్ చేయడానికి అవకాశం తక్కువగా ఉంటుందని సర్వేలు సక్రమంగా చేయకపోతే సంజాయిషీ నోటీసులు అధికారులు ఇస్తున్నారని ఆరోపించారు. కరోనా సమయంలో ఏఎన్ఎమ్స్ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సేవలు చేశారని ,రోజంతా పనిచేస్తున్నా కూడా పనులు సక్రమంగా ఏఎన్ఎమ్స్ చేయడం లేదని, అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని,దీని కారణంగా కొంతమంది ఏఎన్ఎమ్స్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు ఏఎన్ఎమ్స్ పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారికి పనిభారం తగ్గించాలని కోరారు. రోజూ ఆన్ లైన్ యాపులు టార్గెట్స్ పెడుతున్నారని, ఫీల్డ్ వర్కులో ఏఎన్ఎమ్స్ సచివాలయాలకు తొందరగా వెళ్ళి అక్కడ బయో మెట్రిక్ వేయడానికి పోతున్న సమయంలో యాక్సిడెంట్స్ కు గురై కొంత మంది ఏఎన్ఎమ్స్ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కొంత మంది అధికారులు పై స్థాయి ఉన్నతాధికారులకు ఏఎన్ఎమ్స్ పట్ల తప్పుడు సమాచారం ఇస్తున్నారని తెలిపారు. ఏఎన్ఎమ్స్ ను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని, వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు.లేని పక్షంలో ఏఎన్ఎమ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు.

సచివాలయం ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర -మదనపల్లి: గ్రామ వార్డ్ సచివాలయం లో పని చేసే రెండో విడత లో నియమించబడిన వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు కోరారు,అనంతపురం భవన్ లో గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశం జరిగింది, ఈ సమావేశం లో వారు మాట్లాడుతూ, నవంబర్ లో రెగ్యులర్ చేయాల్సి ఉండగా ఇంత వరకు చేయక పోవడం దారుణం అని తెలిపారు, వెంటనే 25 వేల మందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు,సచివాలయం ఉద్యోగుల వివిధ సమస్యలును వెంటనే పరిష్కారం చేయాలని కోరారు, సచివాలయం ఉద్యోగుల కు బిఎల్‌వో విధుల నుంచి మినహాయించాలని కోరారు, ఇహెచ్ఎస్ స్కీం ను అమలు చేయాలని కోరారు, గత రెండు సంవత్సరాలకు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని, జాబ్ చార్ట్ ప్రకారం విధులు చేయించాలని కోరారు, కొంతమంది పై అధికారులు సచివాలయంఉద్యోగులకు లీవ్స్ ఇవ్వకుండా ఇబ్బంది కి గురి చేస్తున్నారని అలాంటి వారి పై చెర్యలు తీసుకోవాలని కోరారు, సచివాలయం ఉద్యోగుల దగ్గర వారి సొంత పనులు చేయిస్తున్నారని, చేయకపోతే బయపెట్టిస్తున్నారని తెలిపారు, కొంతమంది బీఎల్‌వో డ్యూటీ లో నిర్లక్ష్యం గా చేస్తున్నారని సస్పెండ్ చేయడం దారుణం అని, అలాంటి సస్పెన్షన్ వెంటనే ఎత్తి వేయాలని కోరారు, ఏఎన్ఎంలకు అనేక రకాల సర్వేల పేరుతో వేదిస్తున్నారని, సర్వేయర్లు కు సమయం లేకుండా పని చేయిస్తున్నారని,సచివాలయం ఉద్యోగుల పై దాడులు చేసిన వారి పై చెర్యలు తీసుకోవాలని కోరారు, సచివాలయం ఉద్యోగుల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు, రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది కి జీతాలు పెట్టకుండా వేదిస్తున్నారని, అలాంటి వారి పై చెర్యలు తీసుకోవాలని కోరారు, అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్ లను ఈ క్రాప్ పేరుతో వేధిస్తున్నారని, వారికీ పని వత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు, శానిటేషన్ సెక్రటరీలకు పనివేళలు లేకుండా పని చేయిస్తున్నారని చేయిస్తున్నారని,హెల్త్ కు సంబందించినవి వెల్ఫేర్ కార్యదర్శిలు తొ చేయిస్తున్నారని, వారికి పని భారం తగ్గించాలని తెలిపారు,మూడు సార్ల అటెండెన్స్ అనే నిబంధనలు తీసివేయాలని కోరారు,ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినోద్, అనంతపురం జిల్లా అధ్యక్షులు గంగాధర్, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున, సచివాలయం ఉద్యోగ నాయకులు నారాయణ స్వామి, రంగనాథ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేపరాలలో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర -మైలవరం : మండల పరిధిలోని వేపరాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు జమ్మలమడుగు శాసనసభ్యులు డా. మూలే సుధీర్ రెడ్డి మండల అధ్యక్షురాలు చేరెడ్డి సావిత్రి, చేరెడ్డి చెన్నకేశవ రెడ్డిలు పాల్గొంటారనివైకాపా మండల కన్వీనర్ దన్నవాడ మహేశ్వర్ రెడ్డి గురువారం సాయంత్రం విలేఖరులకు తెలిపారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే ఎమ్మెల్యే, ఎంపిపి దృష్టికి తెస్తే పరిస్కారం అవుతాయని అన్నారు. మండలంలోని వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలనీ కోరారు.

నేడు కలెక్టరేట్లో ప్రజాఫిర్యాదుల స్వీకరణ

- అధికారులతో సహా ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలి
- కలెక్టర్ గిరీష పిఎస్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 6న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి "స్పందన" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా.. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. అలాగే స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిరుద్యోగ జేపసీ, విద్యార్ధి సంఘు నాయకులకు, ఐటీడీపి నాయకులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: నిరుద్యోగ జేఏసీ,విద్యార్థి సంఘ నాయకులను, ఐటీడీపి నాయకులను టిడిపి బీసీ రాష్ట్ర సాధికారిక సమితి కన్వీనర్ శివ ప్రసాద్ నాయుడు ఘన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై పోరాటం, భవిష్యత్తులో మరింత ఉధృతం చేయాలని, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను, విద్యార్థి వ్యతిరేక, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగడుతూ పోరాటాలు చేయాలన్నారు. అనంతరం సోమవారం నారా లోకేష్ యువగలం పాదయాత్రలో పాల్గొంటున్న నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ షేక్ సిద్దిక్, ఐటిడిపి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, తెలుగు యువత నాయకులు భాస్కర్ నాయక్, మైనార్టీ నాయకులు షేక్ సద్దాం, బీసీ నాయకులు హరిబాబు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పుల్లగూర రామాంజనేయులు, ఉపాధ్యక్షులు శబరిస్, ఎండపల్లి వెంకటరామిరెడ్డి, జయచంద్రలను ఆయన ఘనంగా సన్మానించారు.

38 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 38 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన 80 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 38 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. అలాగే నెల రోజుల విరామం అనంతరం నిర్వహించిన కంటివైద్య శిబిరానికి వచ్చిన గతంలో ఆపరేషన్ చేయించుకున్న 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా,ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు,భార్గవి,మహాలక్ష్మి,ఆప్తాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మాజీ రైల్వే బోర్డు మెంబరు సురేష్ వివాహ రిసెప్షన్

విశాలాంధ్ర-బద్వేల్ : బద్వేల్ మండలం చిన్నకేశంపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పుటూరు రమణయ్య కుమారుడు సురేష్ మాజీ రైల్వే బోర్డు మెంబర్ వివాహం 1వ తేదీన జరగగా ఆదివారం బద్వేల్ ఆర్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వివాహ రిసెప్షన్ ఘనంగా నిర్వహించారు. నూతన వధూవరులైన సురేష్, అనుష వివాహ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్, మాజీ మంత్రి కృష్ణాయాదవ్, పెండ్లికుమారుడు సురేష్ బావ ట్రాన్స్‌కో డీఈఈ గోవిందరాజుయాదవ్, ఏఈ మస్తాన్‌లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్ రైల్వే బోర్డు మెంబర్‌గా చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడా చైర్మన్ గురుమోహన్, బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, కెవి సుబ్బారెడ్డి, బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణ, 20వవార్డు కౌన్సిలర్ గాజులపల్లె ధనలక్ష్మి, వారి భర్త గాజులపల్లి వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రమణయ్య, యాదవ సంఘం నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. వివాహ మహోత్సవానికి వచ్చిన వారికి రుచికరమైన పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేశారు.

చర్చిలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఏసుక్రీస్తు చెప్పినట్లు చేయుడని ఆయన తల్లి మరియమాత చెప్పిందని మైదుకూరు విచారణ గురువు సంబటూరు సురేష్ అన్నారు ఆదివారం మరియాపురం పాత చర్చి ఆవరణంలో జరిగిన సమిష్టి దివ్యబలి పూజలో ఆయన సందేశం ఇచ్చారు. మనమందరం దేవుడు చెప్పినట్లు వినకుండా పాపంలో కూరుపోయాం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకుంటే దేవుడు దీవిస్తారని చెప్పారు. లోక పావని మరియు తల్లి చెప్పినట్లు చేస్తే ఏసుక్రీస్తు ఆశీస్సులు మెండుగా ఉంటాయని అన్నారు. సమాజంలో భిన్నమైన స్వభావం కలిగి ఉంటారని చెప్పారు మనిషి ఘోరమైన పాపాలు చేస్తూ నరక కూపంలో ఇరుక్కుని ఉన్నారని తెలిపారు పాప క్షమాపణ కావాలంటే దేవుడు చెప్పినట్లు ప్రతి ఒక్కరూ చేయాలని ప్రసంగించారు. మరియా పురం విచారణ గురువు బిరుసు రాజా పర్యవేక్షణలో తిరుణాల కమిటీ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న నవదిన జపములతో లూర్దు మాత మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాకరాపేట విచారణ గురువు కే జోసెఫ్ లారెన్స్,తిరుణాల కమిటీ అధ్యక్షులు వారాధి జోసెఫ్, కార్యదర్శి లూర్దు, కోశాధికారి సంయుక్త కార్యదర్శి యన్నం ఆనంద్, ఉప్పలపాటి విజయ భాస్కర్,అల్ఫోన్,గొట్లూరు జ్ఞాన్వేష్,గ్రెగోరి తదితరులు పాల్గొన్నారు.